కెరటం న్యూస్



## చాంద్రాయణగుట్టలో కలకలం.. ఓ ఆటోలో ఇద్దరు యువకుల మృతదేహాలు

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** చాంద్రాయణగుట్ట ప్రాంతంలో చోటుచేసుకున్న అనుమానాస్పద మరణాలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు దారితీశాయి. ఓ ఆటోలో ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యం కావడంతో, ఇది హత్య, ఆత్మహత్యనా లేక డ్రగ్స్ ఓవర్‌డోసా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన యువకులను పోలీసులు జహంగీర్, ఇర్ఫాన్‌లుగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, మరణాలు సహజంగా సంభవించి ఉండకపోవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. పోలీసుల విచారణలో ఆటో లోపల కీలక ఆధారాలు లభించాయి. మత్తు ఇంజెక్షన్లు, స్టెరాయిడ్స్‌కు సంబంధించిన శాంపిల్స్ అక్కడ దొరికాయి. వీటిని బట్టి, అధిక మోతాదులో (ఓవర్‌డోస్) మత్తు ఇంజెక్షన్లు తీసుకోవడం వల్లే యువకులు మరణించి ఉండవచ్చని అధికారులు బలమైన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ మరణాలకు గల అసలు కారణాన్ని నిర్ధారించడానికి పోలీసులు ఫోరెన్సిక్ పరీక్షల నివేదిక మరియు పోస్ట్‌మార్టం రిపోర్ట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఘటనపై స్థానికంగా ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, పోలీసులు ఈ ప్రాంతంలో విచారణను వేగవంతం చేశారు. హత్య లేదా ఏదైనా నేర సంబంధం ఉందా అనే కోణంలో కూడా డేటాను సేకరిస్తున్నారు.

## హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు.. బీజేపీ ఆఫీసు వద్ద భారీగా పోలీసుల మోహరింపు

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలోనే రేవంత్ వ్యాఖ్యలను నిరసనగా యువ మోర్చా ఆందోళనకు పిలుపునిచ్చింది. దీంతో నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం ఎదుట భారీగా పోలీసులను మోహరించారు. ఆందోళనకారులను అక్కడే అడ్డుకునేలా బీజేపీ ఆఫీసుకు ఇరువైపులా బారికేడ్లతో పాటు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

సీఎం వ్యాఖ్యలు ఇలా..

హిందువుల్లో మూడు కోట్ల మంది ఉన్నారని.. పెళ్లి చేసుకోనివాళ్లకు హనుమంతుడు, రెండు పెళ్లిళ్లు చేసుకునేటోళ్లకు ఇంకొక దేవుడున్నారని రేవంత్ అన్నారు. తాగేటోళ్లకు ఎల్లమ్మ, పోచమ్మ, కల్లు పోయాలి, కోడి కోయాలి అనేటోళ్లకు మరో దేవుడున్నారని కామెంట్ చేశారు. పప్పన్నం తినేటోళ్లకు కూడా దేవుడున్నాడని.. ఇలా అన్ని రకాల దేవుళ్లున్నారని తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో కూడా అన్ని రకాల మనుషులున్నారని.. దేవుడిపైనే ఏకాభిప్రాయం లేదన్నారు. ఒకాయన వేంకటేశ్వర స్వామికి మొక్కుతాననంటే, మరొకాయన ఆంజనేయస్వామికి మొక్కుతా అటాడని.. ఇంకొకాయన లేదు.. లేదు నేను అయ్యప్పమాల వేస్తాననంటే, మరో ఆయన శివమాల వేస్తానంటాడని అన్నారు. దేవుళ్ల మీదే మనం ఏకాభిప్రాయం తీసుకురానప్పుడు రాజకీయ నాయకుల మీద ఏకాభిప్రాయం ఉండదని తాను అనుకోవట్లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

## తెలంగాణ రైజింగ్ సదస్సుకు రండి.. ప్రధాని మోడీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రాహుల్, ఖర్గేకు ఆహ్వానం..

ప్రధానితో భేటీకి ముందు కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్?ను ముఖ్యమంత్రి కలిసి గ్లోబల్ సమ్మిట్?కు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమ్మిట్?లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్ గురించి ఆయనకు వివరించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్రమంత్రులు రాజ్ నాథ్ సింగ్, నిర్మాలా సీతారామన్‌తో సీఎం భేటీ అయి సమ్మిట్‌కు రావాలని కోరారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. అలాగే ఏఐసీసీ చీఫ్ ఖర్గేతోపాటు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఉదయం పార్లమెంట్ భవనంలోనే వీరితో భేటీ అయి గ్లోబల్ సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానించారు.

## ఫార్ములా ఈ-రేసు కేసులో బిగ్ అప్‌డేట్... అరవింద్ కుమార్‌పై చర్యలకు DoPTకి సీఎస్ లేఖ

మొదటి పేజీ తరువాయి

కాగా, ఇదే కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిగా ఉన్నారు. అయితే, గతంలో హెచ్ఎండీఏ కమిషనర్‌గా పనిచేసిన అరవింద్ కుమార్ కేబినెట్, ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా, ఎన్నికల కోడ్ అమలుల్లో ఉండగా నిధులను మళ్ళించడంలో కీలక పాత్ర పోషించారని ఏసీబీ ఆరోపిస్తోంది. దేశంలో ఐఏఎస్ అధికారులపై కేసు విచారణ, అభియోగాలు నమోదు చేసేందుకు ముందుగా కేంద్రంలోని DoPT నుంచి ప్రాసిక్యూషన్ అనుమతి తప్పనిసరి కావడంతో సీఎస్ రామకృష్ణా రావు తాజాగా లేఖ రాయడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## సర్పంచ్ ఎన్నికల నామినేషన్ పత్రాలు చోరీ..

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** పెద్దేముల్ మండలంలోని, గొట్లపల్లి, హన్మపూర్, గిర్మాపూర్, జైరాం తండా (ఐ) గ్రామ పంచాయతీలకు కలిపి గొట్లపల్లి క్లస్టర్ నామినేషన్‌ల కేంద్రం ఏర్పాటు చేసి నామినేషన్‌లు స్వీకరించారు. కాగా బుధవారం ఉదయం గ్రామ పంచాయతీ వర్కర్‌లు నామినేషన్ స్వీకరణ కేంద్రమైన గోట్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తెరవాడానికి చూడగా కార్యాలయానికి వేసిన తాళం తెరిచి ఉంది. లోపల చూడగా నామినేషన్ పత్రాలు చిందరవందరగా పడి ఉన్నాయని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి పరమేశ్, ఎన్నికల నిర్వాణ అధికారులు గొట్లపల్లి క్లస్టర్ ఆర్ఓ కోటయ్య, ఏ ఆర్ఓ అంజయ్య, వచ్చి చూశారు.

హన్మాపూర్, గిర్మాపూర్, జైరాం తండా గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్ పత్రాలు కనబడకపోవడంతో పెద్దేముల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పెద్దేముల్ ఎస్సై శంకర్ కార్యాలయానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, ఎమ్మార్వో వెంకటేష్ ప్రసాద్, ఎంపీడిఓ రతన్ సింగ్, అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొన్ని పత్రాలు మిస్ అయ్యాయని, కానీ అన్ని నామినేషన్ పత్రాలు ఆన్లైన్‌లో పొందుపర్చడంతో ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని అన్నారు.

## సంచలనం.. IBOMMA రవికి సైబర్ క్రైంలో జాబ్ ఆఫర్?

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** నాంపల్లి కోర్టులో మరోసారి ఐబొమ్మ రవి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా గురువారం బెయిల్ పిటిషన్ పై వాదనలు వినిపించే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు సార్లు రవిని పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. విచారణ సమయంలో రవికి పోలీసులు భారీ ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. సైబర్ క్రైమ్ విభాగంలో పనిచేయాలని పోలీసులు అడిగినట్టు తెలుస్తోంది. కానీ రవి పోలీసుల ఆఫర్ ను సున్నితంగా తిరస్కరించారట.

అంతే కాకుండా ఇంతకాలం పైరసీ సినిమాలు చేస్తూ కాలం గడిపిన రవి కరేబియన్ దీవుల్లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. కాగా తరవాత కూడా కరేబియన్ దీవులకు వెళ్లి ఐబొమ్మ పేరుతో రెస్టారెంట్ బిజినెస్ పెడతానని చెప్పినట్టు సమాచారం. అంతే కాకుండా ఐబొమ్మ ద్వారా రూ.17 కోట్లు సంపాదించి మొత్తం ఎంజాయ్ చేయడానికే ఖర్చు చేశానని చెప్పినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పోలీసులు రవి అకౌంట్ లోని రూ.3 కోట్లను సీజ్ చేయగా తన భవిష్యత్ ప్రణాళికను వారికి వివరించినట్టు సమాచారం.

## బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్.. నలుగురు మావోయిస్టులు మృతి

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** మావోయిస్టు పార్టీ అగ్ర నేతల వరుస లొంగుబాట్ల నేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. దంతెవాడ–బీజాపూర్ సరిహద్దులో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య ఇవాళ ఉదయం నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు నలుగురు మావోయిస్టులు మృతి చెందారని, అందులో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. నలుగురి మృతదేహాలతో పాటు పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు.

అయితే, వారిని గుర్తించాల్సి ఉందని అన్నారు. 'ఆపరేషన్ కగార్'లో భాగంగా భైరామ్‌గఢ్ పరిధిలోని కేశ్‌కుతుల్ అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు భద్రతా దళాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయని తెలిపారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులను అడ్డుకుని, ధ్వంసం చేయడానికి దాదాపు 50 మంది మావోయిస్టులు ప్రయత్నిస్తుండగా భద్రతా బలగాలు వారిపై మెరుపుదాడి దిగాయని వెల్లడించారు. మావోయిస్టుల ప్లాన్ గురించి అందిన సమాచారం మేరకు సీఆర్పీఎఫ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, డీఆర్‌జీ బృందాలు హుటాహుటిన కూబింగ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయని.. ప్రస్తుతం ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఐజీ సుందర్ రాజ్ వెల్లడించారు.

## భూముల ధరకు రెక్కలు.. అక్కడ ఎకరా రూ.151.25 కోట్లు !

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** కోకాపేట్ లో సుమారు రూ.300 కోట్లకుపైగా ఖర్చుతో 40 ఎకరాలతో కూడిన నియోపోలిస్ లేఅవుట్ ను హెచ్ఎండీఏ డెవలప్ చేసింది. ఈ లేఅవుట్ లో హెచ్ఎండీఏ సకల సౌకర్యాలను కల్పించింది. ఫలితంగానే రికార్డు స్థాయి రేట్లు పెట్టి కొనుగోలు చేస్తున్నారని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఈ లేఅవుట్ లోని ఎకరాకు హెచ్ఎండీఏ రూ.99 కోట్లు ప్రారంభ ధరగా నిర్ణయించింది. 15వ నెంబర్ ప్లాట్ లోని ఎకరాకు రూ.151.25 కోట్లు వెచ్చించి 4.03 ఎకరాలను రూ.609 కోట్లతో జీహెచ్ఆర్ లక్ష్మీ ఇన్ ఫ్రా అర్బన్ బ్లాక్స్ సంస్థ దక్కించుకున్నది. 16వ నెంబర్ ప్లాట్ లోని ఎకరా రూ.147.75 కోట్ల చొప్పున 5.03 ఎకరాలను రూ.743 కోట్లతో గోద్రేజ్ ప్రాపర్టీస్ లిమిటెడ్ సంస్థ దక్కించుకున్నది.

కోకాపేట్ లోని నియోపోలిసు లేఅవుట్ లో 15 నుంచి 20 వరకు ఆరు ప్లాట్లకు ఈ-వేలం వేయాలని హెచ్ఎండీఏ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఎకరాకు ప్రారంభ ధర రూ.99 కోట్లు నిర్ణయించారు. అయితే ఈ నెల 24వ తేదీన 17, 18 ప్లాట్లకు వేలం వేశారు. 18వ ప్లాట్ లో ఎకరాకు రూ.137.25కోట్లు వెచ్చించి 5.31ఎకరాలను రూ.728.79కోట్లతో ఎంఎస్ఎన్ అర్బన్ వెంచర్స్ ఎల్ఎల్పీ సంస్థ దక్కించుకున్న విషయం తెలిసిందే. దీంతోపాటు ఎకరాకు రూ.136.50 కోట్ల చొప్పున 4.59ఎకరాలను రూ.626.53 కోట్లతో వజ్రా హౌసింగ్ ప్రాజెక్టు ఎల్ఎల్పీ సంస్థ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ రెండు ప్లాట్ల ద్వారా హెచ్ఎండీఏకు రూ.1356కోట్ల ఆదాయం వచ్చింది. నాలుగు ప్లాట్ల ద్వారా హెచ్ఎండీఏకు రూ.2,708 కోట్ల ఆదాయం రావడం హర్షనీయమని మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. నియోపొలిస్ లోని ఆరు ప్లాట్లకు గాను ఇప్పటికే నాలుగు ప్లాట్లకు వేలం పాటను పూర్తి చేశారు. మరో రెండు ప్లాట్లతోపాటు కోకాపేట్ లోని గోల్డ్ మైన్ లేఅవుట్ తోపాటు మూసాపేట్ లోని 15 ఎకరాల భూములకు సైతం వేలం నిర్వహించనున్నారు.

## రేవంత్ రెడ్డి ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తున్నారు ప్రధాన ఎన్నికల అధికారికి కవిత లేఖ

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** పంచాయితీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఎన్నికల అధికారులకు లేఖ రాశారు. దానిని ఆపాలని లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో లేని జిల్లా కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల తరుపున ప్రచారం కోసం సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే దీనిపై జాగృతి ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు.

డిసెంబర్ 1వ తేదీన రేవంత్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున రేవంత్ ప్రచారం చేశారన్నారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల పేరుతో గ్రామీణ ఓటర్లను ప్రలోభపెట్టే పనులు చేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో డిసెంబర్ 2న కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల కోసం ప్రచారం చేశారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించనున్నారని ఆరోపించారు. ఆయన మాట్లాడిన వీడియో క్లిప్పింగ్స్ జత చేస్తున్నామని చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారిని కోరారు.

## హిల్ట్ పాలసీ లీక్ పై తెలంగాణ ప్రభుత్వం సీరియస్

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి సంబంధించిన విధాన నిర్ణయం జీవో విడుదల కాకముందే దీనికి సంబంధించిన సమాచారం ప్రతిపక్షాలకు లీక్ కావడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. పాలసీని తీసుకురావాలని కసరత్తు చేస్తున్న దశలోనే సమాచారం లీకై ప్రతిపక్షాలకు చేరడంపై దృష్టి సారించింది. ఈ లీకుల వ్యవహారంలో నిగ్గు తేల్చేందుకు తాజాగా ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. నవంబర్ 20 న ఫోటోషాప్ స్లైడ్స్ బయటకు వచ్చినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మరుసటి రోజు నవంబర్ 21న హిల్ట్ పాలసీపై ప్రతిపక్ష నేత కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టిన ప్రభుత్వ పాలసీపై విమర్శలు గుప్పించారు. అయితే నవంబర్ 22న ప్రభుత్వం జీవో విడుదల చేయగా అంతకు ముందురోజే కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించడం వెనుక సమాచార లీకుల వ్యవహారం ఉందనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో ఇప్పటికే శాఖాపరమైన విచారణకు ఆదేశించిన అధికారులు తాజాగా విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

## అరావళి కొండలకు మోదీ ప్రభుత్వం 'మరణశాసనం' రాసింది: సోనియా గాంధీ



**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** అటవీ, పర్యావరణ పరిరక్షణ పై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో స్పందించారు. మోడీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ విషయంలో ముఖ్యంగా "దుర్మార్గపు నిస్పత్తువ"ను ప్రదర్శించిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఇప్పుడు అరావళి కొండలకు "మరణ శాసనం" రాసినట్లేనని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఆమె తీవ్రంగా విమర్శించారు. పార్లమెంట్ ఆవరణలో సోనియా గాంధీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పార్లమెంటులో "బుల్డోజ్" చేసిన అటవీ (సంరక్షణ) చట్టం, 1980 సవరణలను, అటవీ సంరక్షణ నియమాలు (2022) ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అరావళి శ్రేణిలోని 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న ఏ కొండ అయినా మైనింగ్ ఆంక్షలకు లోబడి ఉండదని ప్రభుత్వం ప్రకటించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఎత్తు పరిమితి కంటే తక్కువగా ఉన్న అరావళి శ్రేణిలోని 90% భాగాన్ని అక్రమ మైనింగ్ మాఫియాలు సర్వనాశనం చేయడానికి ఇది బహిరంగ ఆహ్వానమని ఆమె ఆరోపించారు.

## దేశవ్యాప్తంగా నిలిచిపోయిన ఇండిగో విమాన సేవలు

**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఇండిగో విమాన సేవలు దేశవ్యాప్తంగా నిలిచిపోయాయి. ఇండిగో విమానాలన్నీ ఎయిర్ పోర్టులకే పరిమితం అయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. నిన్న రాత్రి నుండి ఎయిర్ పోర్ట్‌లలో ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. టెక్నికల్ సమస్య కారణంగానే విమాన సర్వీసులు నిలిచిపోయినట్టు తెలుస్తోంది. బెంగుళూరు కంపెగౌడ విమానాశ్రయంలో 42 ఇండిగో విమానాలను రద్దు చేసినట్టు సమాచారం. మరోవైపు నిన్న కూడా పలు విమానాలకు అంతరాయం కలిగింది. కోయంబత్తూరు విమానాశ్రయంలో ముంబైకి వెళ్లాల్సిన ఇండిగో విమానం మూడు గంటలు ఆలస్యం అయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్ పోర్టులో కూర్చునేందుకు స్థలం లేదని, ఫ్లైట్ ఆలస్యం అవ్వడంపై సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ముంబైలో భారీ వర్షం కారణంగా విమానం ఆలస్యంగా నడుస్తోందని సిబ్బంది సమాధానం ఇచ్చారు. ఇక దేశవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే నెలకొంది.

## 80 వేల మంది చూస్తుండగా.. కాల్చి చంపిన 13 ఏళ్ల బాలుడు.. భక్తితో నినాదాలు చేసిన జనాలు



**న్యూస్ డెస్క్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** అది ఒక భారీ స్టేడియం.. అక్కడ సుమారు 80 వేల మందికి పైగా జనం గుమికూడారు. అంత మంది చూస్తుండగా.. ఓ 13 ఏళ్ల బాలుడు.. తన ఎదురుగా ఉన్న వ్యక్తి గుండెల్లోకి గురి చూసి కాల్పులు జరిపాడు. తూటా దెబ్బకు ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది చూసి చుట్టూ ఉన్న జనాలు భక్తితో ఆర్తనాదాలు చేశారు. మరి కొందరు హాహాకారాలు చేశారు. ఏది ఏమైనా పదమూడేళ్ల పిల్లాడి చేతికి గన్ ఇవ్వడమే తప్పు అనుకుంటే.. ఆ బాలుడి చేతనే చంపించడం మరింత దారుణం. ఇంతకు ఈ సంఘటన ఎక్కడ చోటు చేసుకుంది అంటే.. ఇంకెక్కడ తాలిబన్ల పాలన కొనసాగుతున్న ఆఫ్గానిస్థాన్‌లో తూర్పు ఆఫ్గానిస్థాన్‌లోని ఒక స్టేడియంలో ఈ బహిరంగ మరణ శిక్ష అమలు చేశారు. ఈ ఘటనను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల అధికారులు 'అమానవీయం' అని ఖండించారు. వివరాల ప్రకారం.. మంగల్ అనే వ్యక్తి తూర్పు ఆఫ్గానిస్థాన్‌లోని ఖోస్ట్‌లో ఒకే కుటుంబానికి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేశాడు. అందులో తొమ్మిది మంది చిన్నారులున్నారు. ఈ కేసును విచారించిన సుప్రీం కోర్టు అతడికి మరణ శిక్ష విధించింది. బాధిత కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలుడు.. నిందితుడైన మంగల్‌ను తుపాకీతో కాల్చి మరణ శిక్షను అమలుపర్చాడు. ఈ శిక్షను చూడటానికి వేలాది మంది ప్రజలు హాజరయ్యారు. ఈ మరణశిక్షను కోర్టు 'ప్రతీకార శిక్ష'గా అభివర్ణించింది. కేసును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. బాధితుల కుటుంబాలకు క్షమాభిక్ష, శాంతి ప్రతిపాదనలు చేశామని, కానీ వారు తిరస్కరించారని కోర్టు పేర్కొంది. ఈ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి మాట్లాడుతూ.. ఈ శిక్ష భవిష్యత్తులో నేరాలు చేయకుండా అడ్డుకుంటుందని అభిప్రాయపడ్డాడు. ఇకపై ఎవరూ ఎవరినీ చంపడానికి సాహసించరు అని అన్నాడు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరు కావాలని అధికారికంగా ప్రకటనలు కూడా జారీ చేశారని తెలిపాడు. నివేదికల ప్రకారం 2025 జనవరిలో బాధిత కుటుంబంపై కొందరు దుండగులు దాడి చేశారు. వీరిలో మంగల్ అనే నిందితుడు ఉన్నాడు. ఈ దాడిలో చనిపోయిన వారిలో ముగ్గురు మహిళలతో సహా మరో పది మంది మరణించారు. దాడిలో పాల్గొన్న మంగల్‌కి బహిరంగ మరణశిక్ష విధించారు. అయితే ఈ తీర్పును ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నివేదికకర్త రిచర్డ్ బెన్నెట్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది అత్యంత క్రూరమైన అమానవీయ అసాధారణ శిక్ష. ఈ తీర్పు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం అని అన్నారు. తాలిబన్ల పాలనలో బహిరంగ మరణశిక్షలు సర్వసాధారణం. గతంలో 1996–2001 వరకు కొనసాగిన తాలిబన్ల పాలనలో తరచుగా బహిరంగ మరణశిక్షలు విధించేవారు. అప్పట్లో క్రీడా మైదానాల్లోనే ఈ శిక్షలు అమలు చేసేవారు. 2021లో తాలిబన్లు తిరిగి అధికారం చేపట్టిన తర్వాత ఇది 12వ బహిరంగ మరణశిక్ష. దీనికి ముందు అక్టోబర్‌లో బాధిస్‌లో 11వ కేసు నమోదైంది. ఇంతకుముందు ఏప్రిల్‌లో, అధికారులు మూడు వేర్వేరు ప్రావిన్సుల్లో నలుగురు వ్యక్తులకు ఒకేసారి మరణశిక్ష విధించారు. దొంగతనం, వ్యభిచారం, మద్యం సేవించడం వంటి నేరాలకు తాలిబన్లు ఇప్పటికీ కొరడాలతో కొట్టడం వంటి శారీరక శిక్షలను అమలు చేస్తున్నారు. అయితే ఈ బహిరంగ మరణశిక్షలకు కందహార్‌లో ఉన్న తాలిబన్ల సుప్రీం నాయకుడు హిబతుల్లా అఖుంద్జాదా ఆమోదం తప్పనిసరి.

## లేని సామాజికవర్గాలకు రిజర్వేషన్‌లా? పది మంది ఉన్నా.. నాలుగైదు పదవులా?

మొదటి పేజీ తరువాయి

పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కొన్ని గ్రామాల్లో ఎస్టీలు లేకపోయినా ప్రభుత్వం వారికే సర్పంచ్ స్థానంతోపాటు వార్డు మెంబర్ స్థానాలను రిజర్వు చేసిందని తెలిపారు.

ఒక వర్గానికి చెందినవారు కేవలం ఆరుగురు ఓటర్లు ఉంటే వారికి సర్పంచ్ స్థానంతోపాటు రెండు వార్డులు, 8 మంది ఓటర్లున్నా సర్పంచ్ స్థానాన్ని రిజర్వు చేశారని చెప్పారు. అందువల్ల రిజర్వేషన్లు సవరించి తాజా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న సింగిల్‌బెంచ్ ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై ఆశ్చర్యం వ్యక్తంచేసింది. తాము ఎలాంటి ఆదేశాలిచ్చినా దాని పరిణామాలు తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో ఈ వ్యవహారాన్ని డివిజన్ బెంచ్‌కు నివేదించాలని ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పిటిషన్లలో పేర్కొన్న పంచాయతీలను ఇతరులకు రిజర్వు చేయాలంటూ ఉత్తర్వులు జారీచేస్తే అవి రోస్టర్ ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతోపాటు విస్తృత పరిణామాలకు దారి తీస్తాయని, ఖజానాకు నష్టం ఏర్పడినా దానివల్ల ప్రయోజనమూ ఉండదని అన్నారు. అందువల్ల ఈ పంచాయతీ ఎన్నికలపై డివిజన్ బెంచ్ తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని, ఈ పిటిషన్లను బుధవారం డివిజన్ బెంచ్ ముందుంచాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు.

అణగారిన వర్గాలకు అధికారం కోసమే రిజర్వేషన్లు

సామాజిక న్యాయంతోపాటు చారిత్రకంగా అణగారినవర్గాలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందని న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణం 243–డీ, 243–టీ ప్రకారం గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు అందించాల్సి ఉందని చెప్పారు. గ్రామ స్వయం పాలన నిమిత్తం ఏర్పాటయ్యే కార్యనిర్వాహక సంస్థ పంచాయతీ అని, ఇది స్థానిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలుకు జవాబుదారీగా ఉండేలా పంచాయతీ ప్రతినిధులను ప్రజలు నేరుగా ఎన్నుకోవడం ద్వారా స్వయం పాలన వ్యవస్థ ఏర్పాటవుతుందని వివరించారు. పలు రాష్ట్రాలు ఎస్టీ, ఎస్సీ బీసీ, మహిళలకు పాలనలో ప్రాతినిధ్యం, భాగస్వామ్యం కల్పించడానికి వీలుగా రిజర్వేషన్ల కల్పనకు చట్టాలున్నాయని తెలిపారు. అయితే సంబంధిత వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోతే ఈ సూత్రాలు వీగిపోతాయని వ్యాఖ్యానించారు.

ఎస్టీలు లేని గ్రామంలో రిజర్వేషన్!

అంతకుముందు పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. వరంగల్ జిల్లా సంగెం మండలం వంజరపల్లి పంచాయతీలో ఎస్టీ ఓటరు ఒకరూ లేరని అయినా సర్పంచ్‌తోపాటు మూడు వార్డు మెంబరు స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేశారని చెప్పారు. సంగెం మండలం ఆశలపల్లి గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ స్థానంతోపాటు రెండు వార్డు మెంబరు స్థానాలను ఎస్సీలకు రిజర్వు చేశారని తెలిపారు. నల్లగొండ జిల్లా అనుముల మండలం శివాలయం పేరూరు గ్రామంలో ఎస్టీలే లేరని, అయినా సర్పంచ్ తోపాటు 4 వార్డు మెంబర్లను ఎస్టీలకు కేటాయించారని చెప్పారు.

అదే జిల్లాలోని కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామంలో కేవలం ఆరుగురు ఎస్టీ ఓటర్లు ఉంటే ఒక సర్పంచ్, రెండు వార్డు స్థానాలను ఎస్టీలకు రిజర్వు చేశారని, సర్పంచ్ పోస్టును ఎస్టీ మహిళకు కేటాయించారని వివరించారు. దీనిపై 2024లోనే వినతి పత్రం సమర్పించినా పట్టించుకోలేదని తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం తకలపల్లి గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఎస్టీలకు రిజర్వు చేశారని, కానీ ఈ గ్రామంలో ఎస్టీలు కేవలం 13 మంది ఉండగా అందులో ఓటర్లు 8 మంది మాత్రమేనని తెలిపారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా, కాగజ్‌నగర్ మండలం, భట్‌పల్లి జీపీ సర్పంచ్, 6 వార్డు మెంబరు స్థానాలను ఎస్టీలకు 2011 జనాభా లెకల ప్రకారం రిజర్వు చేశారని పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు భగ్గుమన్న బిజెపి నేతలు

## నినాదాలతో హోరెత్తిన జడ్పీ సెంటర్

- రేవంత్ చిత్రపటాన్ని ఛిద్రం చేసిన బిజెపి నాయకులు
- కార్యకర్తలకు పోలీసులు మధ్య తోపులాట
- కార్యకర్తలు అరెస్టు, పోలీస్ స్టేషన్ తరలింపు





**ఖమ్మం బ్యూరో, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవీ దేవతలపై, యావత్ హిందూ సమాజ మనోభావాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా నేతలు బుధవారం వీధుల్లోకి వచ్చి నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి అనుసరిస్తున్న అడ్డగోలు మైనారిటీ సంతుష్టికర రాజకీయాలు, హిందువులను పదేపదే అవమానిస్తున్న తీరుపై మండిపడిన బీజేపీ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఖమ్మం నగరంలోని జడ్పీ సెంటర్ వద్ద బుధవారం నాడు బిజెపి నాయకులు, కార్యకర్తలు చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జడ్పీ సెంటర్ కి చేరుకొని, రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ పార్టీని 'ముస్లిం పార్టీ'గా భావిస్తున్నారని, తెలంగాణ రాష్ట్రాన్ని ముస్లిం దేశంగా మార్చాలనే దృఢ సంకల్పంతో ఉన్నట్లు కనిపిస్తోందని తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి, హిందూ దేవీ దేవతలపై పదే పదే అనుచిత వ్యాఖ్యలు చేయడం రేవంత్ రెడ్డికి పరిపాటి అయిందని ధ్వజమెత్తారు.

' రేవంత్ రెడ్డి ఏ పుట్టుకకు పుట్టారని, ఎక్కడ జన్మించారని ప్రశ్నించిన నేతలు, తన జన్మ గురించి ఒకసారి ప్రశ్నించుకోవాలని హితవు పలికారు. "నువ్వు ఏం పుట్టక పుట్టావో ఒకసారి నిన్ను మేము ప్రశ్నిస్తున్నామంటూ" సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ మనోభావాలను దెబ్బతీసే అధికారం ఆయనకు ఎక్కడిదని నిలదీశారు.

"హిందువులను అవమానిస్తే సహించేది లేదన్నారు.

తాగుబోతులకు ఒక దేవుడుంటాడు, మాంసం తినే వారికి ఒక దేవుడుంటాడు, పెళ్లికానోళ్లకు ఒక దేవుడుంటాడు, పెళ్లయినోళ్లకు ఒక దేవుడుంటాడు' అని చేసిన వ్యాఖ్యలపై వారు మండిపడ్డారు సనాతన ధర్మం ప్రకృతిని ఆరాధించమని, కనపడ్డ చెట్టుకు, పుట్టకు, రాయికి కూడా మొక్కుతామని, ప్రతి దానిలోనూ మనకు ఉపయోగపడే ప్రకృతిని ఆరాధిస్తామని వివరించారు. ఇటువంటి సనాతన ధర్మానికి సంబంధించిన భారతదేశంలో పుట్టిన రేవంత్ రెడ్డి ప్రతిసారీ మైనారిటీ సంతుష్టికర రాజకీయాల కోసం హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.

"రేవంత్ రెడ్డి ప్రభుత్వం గద్దె దించే రోజు దగ్గర్లోనే ఉంది. యావత్ హిందూ సమాజం మొత్తం ముఖ్యమంత్రిపై, ప్రభుత్వంపై తిరగబడే రోజు త్వరలోనే వస్తుందని" బీజేపీ నేతలు గట్టిగా హెచ్చరించారు. ఇప్పటికైనా బేషరతుగా హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఇంకొక్కసారి నువ్వు హిందూ దేవీ దేవతలపై మాట్లాడే సాహసం కూడా చేయొద్దని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా తరపున హెచ్చరిక జారీ చేశారు. ఇది రేవంత్ రెడ్డికి ఆఖరి అవకాశం అని కూడా బీజేపీ నేతలు స్పష్టం చేశారు. హిందువులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, నిరసనకారులు రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని నేలపై వేసి చిద్రం చేశారు. బిజెపి నేతలు ఆందోళన చేస్తున్న క్రమంలో పోలీసులు పెద్ద ఎత్తున అక్కడ చేరుకొని ఆందోళన కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, బిజెపి నేతలకు, కార్యకర్తల మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. నిరసన ఆందోళన కార్యక్రమం తీవ్రం కావడంతో పోలీసులు బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్ కుమార్, మీడియా ఇన్చార్జి డా.. నెల్లూరి బెనర్జీ, మందడపు సుబ్బారావు, వీరెల్లి రాజేషు, రవి రాథోడ్, ఆర్ వి ఎస్ యాదవ్, దొడ్డ అరుణ, రజనీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదలకు అండ... ఇందిరమ్మ ప్రభుత్వం

## కాంగ్రెస్ నేత. వడ్డెబోయిన

## సిఎంఆర్ఎఫ్ చెక్ ను అందచేసిన వడ్డెబోయిన



**ఖమ్మం టౌన్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు తో మంజూరు అయిన చెక్ ను తుమ్మల నాగేశ్వరరావు ఆదేశానుసారం 25 వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డివిజన్ మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు లబ్ధిదారుడు అయిన పంతంగి శ్రీనివాస్ కు 60,000 విలువ గల చెక్ ను అందచేశారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు హాస్పటల్ లో ఆరోగ్య నిమిత్తం చికిత్స చేసుకున్న కడు బీదవారికి వారి యొక్క ఉపశమనం కోసం ప్రతిష్ఠాత్మకంగా కడు బీదవారికి మంజూరు చేయడం రేవంత్ రెడ్డి గారి ఘనత అన్నారు. ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేదలు అయిన కడు బీదవారు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగ పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు దాసరి పూర్ణ నాగిశెట్టి రాధాకృష్ణ డివిజన్ ప్రముఖులు నోముల శ్రీనివాస్ నగర కాంగ్రెస్ నాయకులు బండారు శ్రీనివాస్ మైనారిటీ నాయకులు కాజ డివిజన్ నాయకులు ఎలగందుల శ్రీను గార్ల వెంకన్న కందికొండ శ్రీను పెంటి లక్ష్మయ్యా డివిజన్ మహిళ పడాల లీలావతి పంతంగి పుల్లయ్య లబ్దిదారుడు తదితరులు పాల్గొన్నారు.

# బాలోత్సవం లో పాల్గొనండి పిల్లల్ని ప్రోత్సహించండి

**ఖమ్మం టౌన్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఈనెల 10వ తారీఖు నుండి 12వ తారీకు వరకు మంచి కంటి హాల్ నందు జరుగుతున్న బాలోత్సవంలో పాల్గొనవలసిందిగా కన్వినింగ్ కమిటీ ఒక ప్రకటన ద్వారా కోరింది. దీనికి సంబంధించిన బ్రోచర్లు అన్ని పాఠశాలలకు అందించటానికి ప్రయత్నించటం జరిగిందని, ఒకవేళ ఏ పాఠశాల కైనా అందని యెడల ఈ ప్రకటననే ఆహ్వానంగా భావించి మీ పాఠశాల నుండి సబ్ జూనియర్స్ 1-4వ తరగతి విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, ఫాన్సీ డ్రెస్ పోటీలు, జూనియర్స్5 -7వ తరగతి, సీనియర్స్ 8 - 10 తరగతి విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, డ్రాయింగ్, పాటల, నృత్య విభాగాల్లలో నిర్వహించే పోటీలలో పాల్గొనవలసినదిగా కోరడం జరిగింది. పాఠశాలల ఎంట్రీలను ఎస్ నాగేశ్వరరావు 9490300672, వై రవికుమార్ 9440008877 నెంబర్ లకు పంపవలసిందిగా ఒక ప్రకటనలో కోరారు.

# సీఎం జిల్లా పర్యటనలు ఎన్నికల కోడ్ ఉల్లంఘనే

## ▶▶ యదేచ్ఛగా ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దాడి

## ▶▶ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్




**ఖమ్మం బ్యూరో, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇరవై నాలుగు నెలల పాలన పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి చేపడుతున్న జిల్లా పర్యటనలు, ప్రస్తుతం అమల్లో ఉన్న గ్రామ పంచాయతీ ఎన్నికల నియమావళిని నిస్సిగ్గుగా ఉల్లంఘించడమేనని, ఇది స్థానిక సంస్థల ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమేనని ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్ తీవ్రంగా విమర్శించారు. ఖమ్మం తెలంగాణ భవన్లో బుధవారంఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి స్వయంగా రంగంలోకి దిగి, జిల్లా కేంద్రాలలో బహిరంగ సభలు నిర్వహించి, తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరడం ఒక దుష్ట సంప్రదాయానికి తెర లేపడమేనని తాతా మధుసూదన్ మండిపడ్డారు. ముమ్మాటికి ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ శంకుస్థాపన వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని సైతం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార వేదికగా మార్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దివాలా కోరుతనానికి నిదర్శనం అన్నారు. మన్మోహన్ సింగ్ లాంటి ప్రముఖ ఆర్థికవేత్తకు చేసిన అవమానంగా ఈ చర్యను పరిగణించాలన్నారు. ఆ వేదికపై మన్మోహన్ సింగ్ గారి సేవలను కనీసం ప్రస్తావించకపోవడం కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వపు అజ్ఞానానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమని గొప్పలు చెప్పిన మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి హాజరైనప్పటికీ ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో సభా ప్రాంగణం వేలవేల పోయిందని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ మంత్రులు ముక్కుపచ్చలారని విద్యార్థులను తీసుకొచ్చి సభను నిర్వహించారని విమర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనల కోసం ఖర్చు చేస్తున్న సొమ్ము, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఇరవై నాలుగు నెలల కాలంలో జిల్లాకు కేటాయించిన అభివృద్ధి నిధుల కంటే ఎక్కువగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ జిల్లాకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి రైతు వీరన్న ఆత్మహత్యను ఉటంకిస్తూ, ఇది ప్రభుత్వ విధానాల వైఫల్యం వల్ల జరిగిన ప్రభుత్వ హత్యగా భావించవలసి ఉంటుందన్నారు. రుణమాఫీ హామీని అమలు చేయడంలో విఫలమైన మంత్రులు తక్షణమే రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని మీడియా సాక్షిగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ డిమాండ్ చేశారు. పత్తికి కేంద్రం ద్వారా సీసీఐ ప్రకటించిన క్వింటా రూ. 8,110గా కనీస మద్దతు ధర చెల్లించాల్సి ఉండగా, బహిరంగ మార్కెట్లో క్వింటా రూ. 6,000 కూడా దక్కకపోవడంపై జిల్లా మంత్రుల నియంత్రణ లేకపోవడం దారుణమని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 420 హామీలన్నీ గాలికి వదిలారని ఎమ్మెల్సీ తాత మధుసూదన్ గుర్తు చేశారు. ప్రధానంగా లక్ష తులాల బంగారం తెలంగాణ రాష్ట్ర ఆడబిడ్డలకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందన్నారు, వృద్ధులకు రూ. 4000 పింఛను, వికలాంగులకు రూపాయల 6000, నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం, ప్రజలను మోసం చేసినందుకు జరుపుకుంటున్న ఉత్సవాలుగా బీఆర్ఎస్ పార్టీ భావిస్తోందని తాతా మధుసూదన్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి బహిరంగంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నా, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం (టీఎస్ఈసీ) కఠిన చర్యలు తీసుకోకుండా నిద్రమత్తులో ఉండటం రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి, భద్రాచలంలో నామినేషన్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారుల తీరుపై ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో 42% బీసీ రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఖమ్మం జిల్లాలో కేవలం 9% రిజర్వేషన్లు మాత్రమే కల్పించి బీసీల రాజకీయ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న, అత్యధిక బీసీ జనాభా గల తిరుమలాయపాలెం, రఘునాథపాలెం వంటి మండలాల్లో బీసీలకు 'సున్నా' రిజర్వేషన్లు కేటాయించడం బీసీల పట్ల వారి చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు. బీసీలను రాజకీయంగా సమాధి చేయాలని చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లు తగిన గుణపాఠం చెప్పాలని, బీసీ నాయకులు తమ వాటాను దక్కించుకోవడానికి పోరాడాలని పగడాల నాగరాజు పిలుపునిచ్చారు.

మీడియా సమావేశ తదనంతరం దాసోజు శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలతో ఘనంగానివాళులర్పించినారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూల్, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సీనియర్ నాయకులు, ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, జిల్లా మైనారిటీ అధ్యక్షులు తాజుద్దీన్, ఉద్యమకారులు మంచికంటి నరేష్, కోడి రెక్క ఉమాశంకర్, నెమలికొండ వంశీ నాయకులు బలుసు మురళీ కృష్ణ, మహమ్మద్ రఫీ, చీకటి రాంబాబు, నాయకులు వీరేందర్ గౌడ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా గ్రానైట్ మార్కర్ కమిటీ ప్రమాణ స్వీకారం



**ఖమ్మం టౌన్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ కొత్త పాలకవర్గ సభ్యుల్ని ప్రమాణ స్వీకారం. యూనియన్ పెద్దలు గౌరవ సలహాదారులు నరేంద్ర మరో గౌరవ సలహాదారులు వెంపటి వెంకటేశ్వర్లు గౌరవ అధ్యక్షులు వెంపటి ఉపేంద్ర కొత్త పాలకవర్గాలను సభ్యుల్ని ప్రమాణ స్వీకారం చేపించారు. ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు గౌరవ ప్రెసిడెంట్ కిషన్, ఉపాధ్యక్షులు పాషా, ట్రెజరర్ గా సైదులు, సెక్రటరీగా షేక్ జానీ, ఉపాధ్యక్షులు 1 గిరి, ఉపాధ్యక్షులు టు భద్రం, ట్రెజరర్ 2 రామ్మూర్తి, జాయింట్ సెక్రెటరీ నామాల నరసింహారావు, జాయింట్ సెక్రెటరీ 2 హనుమంతు, ఈసీ మెంబర్స్. వడ్లకొండ శీను, శ్రీకాంత్ , వెంకటేష్, అంజి, ఫయాజ్, దిలీప్, హాలీం, ప్రమాణ స్వీకారం చేశారు నూతన ప్రెసిడెంట్ కిషన్ గ్రూప్ అభివృద్ధి కోసం గ్రూపులో ఉన్న సభ్యులకి ఏ సమస్య వచ్చినా ప్రతి సమస్యను పరిష్కరిస్తానని తెలియజేయడం జరిగినది గ్రూపులో ఉన్న మిగతా సభ్యులు భారీ ఎత్తున హాజరు కావడం జరిగినది. ఈసీ మెంబర్ వెంకటేష్, తదితరులు ప్రమాణస్వీకారం అనంతరం భోజనాలు ఏర్పాటు చేయడం జరిగినది.

కెరటం న్యూస్



# ఆరోగ్యానికి ఐదు సూత్రాలు

## పిల్లల ఆరోగ్యం సదస్సులో డాక్టర్ కె వి కృష్ణారావు



**ఖమ్మం బ్యూరో, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** టేకులపల్లి గురుకులంలో న్యూ లక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. సంస్థ అధ్యక్షులు గరిడేపల్లి సత్యనారాయణ అధ్యక్షతన పిల్లల ఆరోగ్యం పై అవగాహన సదస్సు జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే 5 సుత్రాలు పాటించాలిఅన్నారు. ఈ 5 సుత్రాలు సమతుల్య ఆహారం , ప్రశాంతమైన నిద్ర , శారీరక శ్రమ , పరిశుభ్రత , వినోదం అని అయన పేర్కొన్నారు. సమతుల్య ఆహారం అంటే విటమిన్లు , మినరల్స్ , పీచు పదార్థాలు , పిండి పదార్థాలు , మాంసం కృతులు , కొవ్వు పదార్థాలు సమపాళ్ళలో ఉండాలన్నారు. పిల్లల ఎదుగుదలకు మూడు రకాల ఎలిమెంట్స్ అవసరం అని ఆయన తెలిపారు. ఐరన్ , క్యాల్షియం , జింకు . యాపిల్ గాని బెల్లం గాని ఖర్జూర పండ్లు , పాలకూర , మటన్ , బీట్రూట్ , మునగాకు , కిస్ మిస్ లు లాంటివి తీసుకుంటే ఐరన్ వస్తుంది అయన అన్నారు. నువ్వులు , తమలపాకులు , రాగిజావ లాంటివి తీసుకుంటే క్యాల్షియం లభిస్తుంది అయన పేర్కొన్నారు. బూడిద గుమ్మడికాయ గింజలు , సన్ఫ్లవర్ గింజలు , పల్లీలు



తినడం వల్ల జింకు వస్తది ఆయన తెలిపారు. ఇటువంటి పదార్థాలు తీసుకోవడం వల్ల చాలా వరకు జబ్బులు రాకుండా ఉంటాయని అయన అన్నారు . కావున పిల్లలకు రాగి జావను మజ్జిగలో గానీ బెల్లం వేసి తాపించాలి అని అయన తెలిపారు . నువ్వులు బెల్లం ఉండలు కలిపి తింటే ఐరన్ ఐరన్ మరియు క్యాల్షియం వస్తాయన్నారు. ప్రశాంతమైన నిద్ర అంటే పిల్లలు 6 నుంచి ఎనిమిది గంటలు విధిగా నిద్ర పోవాలి అని అయన తెలిపారు. దీనివలన బాడీ అంతా రిపేర్ అయి రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహదపడుతుంది వివరించారు. శారీరక శ్రమ అంటే పిల్లలు ఉదయం పూట ప్రతిరోజు ఎండలో ఒక గంట సమయాన్ని కేటాయించి వాకింగ్ , రన్నింగ్ , సైక్లింగ్ , యోగ లాంటి వ్యాయామలు చేయాలన్నారు. దీనివలన శరీరం రిలీఫ్ అయ్యి హ్యాపీ హార్మోన్స్ విడుదల అయి మానసికమైన ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు . విటమిన్ డి వలన రోగ నిరోధక శక్తి పెరిగి ఎటువంటి జబ్బులు రాకుండా ఉండటానికి దోహద పడుతుంది చెప్పారు. పరిశుభ్రత లో వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాల పరిశుభ్రత లు ఉంటాయన్నారు . వ్యక్తిగత పరిశుభ్రత అంటే శరీరానికి శుభ్రంగా ఉంచుకోవడం , గోర్లు కత్తిరించుకోవడం . ఎప్పటికప్పుడు చేతులను హ్యాండ్ వాష్ తో శుభ్రంగా కడుక్కోవడం వల్ల చాలా రకాల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు అని వివరించారు. పరిసరాల పరిశుభ్రత లో ఇంటి చుట్టుపక్కల పిచ్చి మొక్కలు , వేస్ట్ నీరు నిలవ లేకుండా చేయడం వల్ల దోమలు ఉండవు . దాని వలన మలేరియా , బోదకాలు , డెంగు లాంటి జబ్బులు రాకుండా ఉంటాయి తెలియజేశారు. వినోదం అంటే పిల్లలను సంతోషం పరిచే సినిమాలు , టీవీలలో కార్యక్రమాలు గాని , కామెడీ దృశ్యాలు పిల్లలు చూడటం వల్ల ఆహ్లాదము సంతోషం కలిగి మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు అని ఆయన అన్నారు. దీంట్లో భాగంగా పిల్లలను అప్పుడప్పుడు పార్కు మరియు టూర్లకు తీసుకుని పోవడం వలన వాళ్ల మానసిక ఆరోగ్యం మెరుగు అవుతుంది. అలాగే డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి ఆయన హెచ్చరించారు. హాస్టల్లో ఉన్న పిల్లలకు ఎక్కువ శాతం ఎలర్జీ వస్తది కావున గజ్జి తామర రాకుండా ఉండాలంటే తడి దుస్తులు ధరించకూడదు. కావున పొడి దుస్తులు ధరించాలి అని తెలిపారు. ఒకవేళ వ్యాధులు వస్తే వెంటనే చర్మవ్యాధుల డాక్టర్ ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఏ రీనాధారిదేవి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ డి స్వప్న లత, %డ% కే శైలజ, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి మరియు టీచింగ్ స్టాఫ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# రొనాల్డోకు భారీ షాక్.. ట్రంప్ తో భేటీ

## అనంతరం కోటి మంది ఫాలోవర్స్ మాయం..?






**స్పోర్ట్ న్యూస్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** ప్రపంచ ప్రఖ్యాత స్టార్ ఫుట్‌బాల్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో ఎక్స్ వేదికగా ఊహించని షాక్ తగిలింది. గత కొద్ది రోజుల్లోనే ఆయన కోటి మంది ఫాలోవర్లను కోల్పోయాడు. రొనాల్డో ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఏకంగా **10** మిలియన్ల (కోటి) మంది ఫాలోవర్లు తగ్గిపోవడం స్పష్టంగా కనిపించింది. నవంబర్‌లో **115** మిలియన్లుగా ఉన్న ఆయన ఫాలోవర్ల సంఖ్య ప్రస్తుతం **105** మిలియన్లకు తగ్గిపోయింది. దీనికి ప్రధాన కారణం ఫేక్ అకౌంట్లు తొలగించడమే విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే నవంబర్ **18**న అమెరికా అధ్యక్షుడు, ప్రపంచ వ్యాప్తంగా వివాదస్పంగా మారుతున్న డొనాల్డ్ ట్రంప్ తో రొనాల్డో భేటీ కావడం కూడా తీవ్ర ప్రభావం చూపించినట్లు అంచనా వేస్తున్నారు. ట్రంప్ అంటే ఇష్టం లేని వారికి వారి మీటింగ్ కోపం తెప్పించిందని కూడా సమాచారం ఉంది. అయితే ఏది ఏమైనప్పటికి రోనాల్డో రోజుల వ్యవధిలోనే కోటి మంది ఫాలోవర్లను కోల్పోవడం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిపోయింది.

# అక్కినేని అఖిల్ ‘లెనిన్’ రిలీజ్ డేట్ లాక్..

## ఆ స్పెషల్ డే నాడే అయ్యగారి రాక ఫిక్స్!




**మూవీ న్యూస్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** అక్కినేని అఖిల్ హీరోగా ఇండస్ట్రీకి వచ్చి చాలా రోజులే అవుతున్నప్పటికీ పెద్దగా హిట్స్ మాత్రం అందుకోలేదు. ‘అఖిల్’ చిత్రంతో వచ్చిన ఆయన పలు మూవీస్ చేసినప్పటికీ పేరు ప్రఖ్యాతలను మాత్రం అందుకోలేకపోయాడు. మరీ ముఖ్యంగా ‘ఏజెంట్’ అఖిల్ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో అఖిల్ గత రెండేళ్లుగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. మళ్లీ ‘లెనిన్’ చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో రాయలసీమ బ్యాగ్ డ్యాప్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది. అయితే ఈ సినిమాలో ముందుగా.. హీరోయిన్‌గా శ్రీలీలను ఎంపిక చేసుకున్నారు. కొన్ని సీన్లు కూడా షూట్ చేసిన మేకర్స్ ఫస్ట్ గ్లింప్స్ కూడా షేర్ చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచారు. కానీ కొంత భాగం షూటింగ్ పూర్తి అయిన తర్వాత పలు కారణాల వల్ల ఈ సినిమా నుంచి శ్రీలలు తొలగించారని తెలుస్తోంది.

అంతేకాకుండా పలు సీన్స్‌ను రీషూట్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఇందులో హీరోయిన్‌గా శ్రీలీల స్థానంలోకి భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేసుకున్నట్లు టాక్. తాజా.. సమాచారం ప్రకారం.. ఈ సినిమాకు సంబంధించిన రీ షూటింగ్‌తో పాటు.. దాదాపు షూట్ పూర్తి అయినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని **2026** ఫిబ్రవరి **14** వాలెంటైన్స్‌ను పురస్కరించుకుని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే భాగ్యశ్రీ బోర్సే కూడా ఈ షూట్‌లో పాల్గొనబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. డిసెంబర్ చివరి వరకు షూట్ పూర్తి చేసి జనవరిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా చేయబోతున్నారని తెలుస్తోంది.

అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో రాబోతున్న ‘లెనిన్’ ఎంత వరకు ప్రేక్షకులను మెప్పిస్తుందో చూడాలి. ఇక ఫిబ్రవరి **14**వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాకు పోటీగా ‘స్వయంభు’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ వాలెంటైన్స్ డేకి అఖిల్, నిఖిల్ మధ్య గట్టి పోటీ ఉండబోతుందని తెలుస్తోంది. కాగా ‘స్వయంభు’ సినిమాలో సంయుక్త మీనన్, నభానటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. షూటింగ్ ఎప్పుడో ప్రారంభించినప్పటికీ పలు కారణాల వల్ల ఇన్నాళ్లు విడుదల కాలేదు. భారీ అంచనాల మధ్య ఫిబ్రవరిలో రాబోతుందని నిఖిల్ అధికారికంగా ప్రకటించడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అఖండ 2 టికెట్ల ధరలు పెంపు

## సీపీఐ నారాయణ హాట్ కామెంట్స్





**మూవీ న్యూస్, 03 డిసెంబర్ (కెరటం న్యూస్):** టాలీవుడ్ అగ్ర హీరో నందమూరి బాలయ్య తాజాగా నటించిన సినిమా అఖండ **2.** ఈ సినిమా డిసెంబర్ **5**వ తేదీన రిలీజ్ కానున్న నేపథ్యంలో ఏపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ల ధరలను పెంచేందుకు పర్మిషన్స్ ఇచ్చింది చంద్రబాబు నాయుడు ప్రభుత్వం. అయితే ఈ సినిమా టికెట్ల ధరలు పెంచడంపై సీపీఐ నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అఖండ **2** సినిమా టికెట్ల ధరలు పెంచడానికి తీవ్రంగా ఖండించారు. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీస్తున్న పేరుతో, టికెట్ల ధరలను పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని నిప్పులు చెరిగారు.

ఇలా టికెట్ల ధరలు క్రమక్రమంగా పెంచుకుంటూ పోతే, ఐ బొమ్మ రవి లాంటి పైరసీ చేసే వ్యక్తులు పుట్టగొడుగుల్లాగా పుట్టుకు వస్తారని గుర్తు చేశారు. టికెట్ల ధరలు పెంచి ప్రజలను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు సినిమాలు చూడలేని పరిస్థితి, దీనివల్ల ఏర్పడుతోందని పేర్కొన్నారు. దీంతో జనాలు కూడా పైరసీకి అలవాటైపోతున్నారని, పైరసీ వెబ్ సైట్లు ఓపెన్ చేసి సినిమా చూస్తున్నారని తెలిపారు.

ఇకనైనా సినిమా టికెట్ల ధరల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. లేకపోతే, ఐ-బొమ్మ రవి లాంటి వాళ్లను అరెస్టు చేసే నైతిక హక్కు కూడా ప్రభుత్వం కోల్పోతుందని చురకలు అంటించారు సీపీఐ నారాయణ. కాగా, డిసెంబర్ **4**వ తేదీన రాత్రి **10** గంటల అఖండ **2** ప్రీమియర్ షోకు ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ టికెట్ ధరను **600** రూపాయలుగా నిర్ణయించారు. విడుదలైన రోజు నుంచి పది రోజుల పాటు స్క్రీన్ థియేటర్లలో **75** రూపాయలు, మల్టీప్లెక్స్ లో **100** రూపాయలు పెంచుకునేలా జీవో జారీ చేసింది కూటమి సర్కార్.